# పరిశ్రమల ఏర్పాటుకు పుష్కలమైన అవకాశాలు




ఆదిలాబాద్: నూతన ఆవిష్కరణలు చేసిన యువకులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామన్న

- వనరుల వినియోగంతో ఉపాధి
- ఐటీ పరిశ్రమల్లో ఉద్యోగాలు
- టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 1 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బీడీఎన్టీ ఐటీ కంపెనీ ఆధ్వర్యంలో సీఐఐ తెలంగాణ రోడ్‌షోలో భాగంగా యువత, పారిశ్రామిత వేత్తల అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పది సంవత్సరాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నదని తెలిపారు. పారిశ్రామిక వేత్తలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత నూతన ఆవిష్కరణల ద్వారా పారిశ్రామితవేత్తలుగా ఎదుగాలని ఆకాంక్షించారు. జిల్లాలో రైతులు పత్తిపంటను ఎక్కువగా పండిస్తున్నందున ఆదిలాబాద్‌లో టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రగతిపథంలో దూసుకుపోతున్నదని గుర్తు చేశారు. జిల్లాలో రెండు ఐటీ కంపెనీలు పని చేస్తుండగా 230 మంది ఇంజినీర్లు, ఇతరులు ఉద్యోగాలు చేస్తూ భారీ వేతనాలు పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రూ. 40 కోట్లతో నిర్మిస్తున్న ఐటీ టవర్ పనులు కొనసాగుతున్నాయని, వీటిల్లో వేయి మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. జిల్లాలో తెలుగు మీడియం విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మూతపడిన సిమెంటు పరిశ్రమను పునఃప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. ఆదిలాబాద్ సీసీఐ ప్రారంభమైతే 5 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీసీఐని తిరిగి ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని సూచించినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతో జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు పెరగడానికి పారిశ్రామీకరణ అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయం, పోల్ట్రీ, పాడి పరిశ్రమ రంగాల్లో యువతకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. దళితబంధు పథకంలో భాగంగా డిమాండ్ ఉన్న స్కీంలను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి సదస్సులు పారిశ్రామిక వేత్తలు, యువతకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మన్ శేఖర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, బీడీఎన్టీ ఐటీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ దేశ్‌పాండే, పారిశ్రామికవేత్తలు, యువత పాల్గొన్నారు.

**బీజేపీ పాలనలో ప్రజలకు ఇబ్బందులు**

ఎదులాపురం,అక్టోబర్1: దేశంలో బీజేపీ పాలనలో అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకాగా పెద్ద ఎత్తున హమాలీ వర్కర్లు ,కార్మికులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ గూటికి చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించగా. జై తెలంగాణ ..జై జోగు రామన్న నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తుంటే కొందరు నేతలు కుక్కర్లను పంచుతూ రాజకీయలబ్ధి కోసం ప్రయత్నిస్తుండడం హాస్యాస్పదమన్నారు. సామాన్యులకు ఆసరాగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికే ప్రజలు మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్లలోనే తెలంగాణ ప్రగతిపథంలో దూసుకెళ్తున్నదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోందని ధ్వజమెత్తారు. దీంతో నిత్యావసర సరుకుల ధరలు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. గతంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నదని మండిపడ్డారు.

**రక్తదానానికి ముందుకు రావాలి**

రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా ముందుకు రావాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన వారిని అభినందించి పండ్ల రసం అందజేశారు. అనంతరం రక్తదానం చేసిన పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత సైతం స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**మాల సంక్షేమ సంఘ భవనం ప్రారంభం**

అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ సమగ్ర అభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో నిర్మించిన మాల సంక్షేమ సంఘ భవనాన్ని ప్రారంభించిన అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భవన నిర్మాణానికి పాటు పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మాలల సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. జైనథ్‌లోనూ మాల సంక్షేమ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన అర్హులైన దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ స్టడీ సర్కిల్ కోసం రెండెకరాల భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు.

ఆయా కార్యక్రమాల్లో బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, రిమ్స్ డైరెక్టర్ చైర్మన్ జైసింగ్ రాథోడ్, రాష్ట్ర మాల మహానాడు జేఏసీ కన్వీనర్ చెరుకు రాంచందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి భూమన్న, దాసరి బాబన్న, మావల జడ్పీటీసీ నల్ల వనితారాజేశ్వర్, మెట్టు ప్రహ్లాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ బండారి సతీశ్, సాజిదొద్దీన్, అష్రాఫ్, నయీం, మహేందర్, ఎజాజ్, సలీం, కుమ్ర రాజు, సలీంపాషా, సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎదులాపురం: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

## రా రైస్ మిల్ జిల్లా కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నర్సాపూర్ (జీ) అక్టోబర్ 1: మండల కేంద్రంలోని రెడ్డి సంఘభవనంలో ఆదివారం రా రైస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సట్లవార్ మహేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా హరీశ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా కోస్లి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీలుగా మహేశ్, నరేందర్, లీగల్ అడ్వైజర్లుగా తూర్పాటి వెంకటేశ్, సతీశ్ రావు, రాము,సురేశ్ యాదవ్,బచ్చువర్ మహే శ్, సందీప్, అనీశ్‌రెడ్డి, చిన్నయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సట్లవార్ మహేశ్ మాట్లాడుతూ రెస్‌మిల్లర్ల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జామ్ గురుకుల విద్యార్థినులు

సారంగాపూర్, అక్టోబర్1: మండలంలోని జామ్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ పోటీల్లో రాజేశ్వరి, స్పందన, అశ్విని, శ్రీజ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులను జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు అనిల్‌కుమార్, మోహన్, గంగాధర్, పీఈటీలు సులోచన, సంజీవ్, సచిన్ తదితరులు అభినందించారు.

## అండర్ 17 వాలీబాల్ జట్టు ఎంపిక

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 1 : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో అండర్ 17 వాలీబాల్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. జిల్లా నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీలో పాల్గొంటారని పీఈటీలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను పీఈటీలు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమణా రావు, వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్ రావు, ఆర్గనైజర్ వెన్నెల భూమన్న తదితరులున్నారు.

# అర్చకులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న అధికారులు, అర్చకులు

బాసర, అక్టోబర్ 1 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్చకులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన దేవాలయాలకు ధూప దీప నైవేద్యాల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 650 గుళ్లలోని పూజారులకు బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలోని డార్మెటరీ హాల్‌లో ఆలయ ప్రముఖ పూజారులు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం శిక్షణా తరగతులు ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అర్చకులకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు. వైదిక స్మర్త ఆగమం, వీర శైవ ఆగమం, పాంచరాత్ర ఆగమం, గ్రామ దేవత ఆగమంలో అర్చకులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ కలలను నెరవేరుద్దాం

- నిర్మల్ కలెక్టర్ వరుణ్ రెడ్డి
- శ్యాంఘడ్‌లో స్వచ్ఛతా హీ సేవా
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 1 : గాంధీ కలలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్మల్ కలెక్టర్ వరుణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్యాంఘడ్ ప్రాంతంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి శ్రమదానం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చారిత్రక కట్టడమైన శ్యాంఘడ్‌లో శ్రమదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో తిరుమల, డీఆర్‌డీవో విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్యాంఘడ్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్, సిబ్బంది తదితరులు